భారత్ సమాచార్.నెట్
BHARATH SAMACHAR DIGITAL

15, అక్టోబర్ 2026, గురువారం భారత్ సమాచార్

ఫుడ్ పాయిజన్.. బాధితులను పరామర్శించిన MP



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: నర్సాపూర్‌లోని ఓ రెస్టారెంట్‌లో బిర్యానీ తిని అస్వస్థతకు గురై ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మెదక్ MP మాధవనేని రఘునందన్ రావు, బీజేపీ నాయకులు పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారికి అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

పెరుగుతున్న బాధితుల సంఖ్య

నర్సాపూర్‌లోని వన్ ప్యాలెస్ రెస్టారెంట్‌లో బిర్యానీ తిన్న పలువురు అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరడంతో స్థానికంగా ఆందోళన నెలకొంది. తొలుత 20 మందికి పైగా ఉన్న బాధితుల సంఖ్య క్రమంగా 30 దాటినట్లు సమాచారం. స్థానికులతో పాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా తమ స్నేహితులతో కలిసి రెస్టారెంట్‌లో భోజనం చేసి అస్వస్థతకు గురైనట్లు తెలుస్తోంది. ఇదే ఘటనలో రెస్టారెంట్‌లో బిర్యానీ తిన్న ఓ యువకుడు మృతి చెందిన విషయం వెలుగులోకి రావడంతో ఈ ఘటన తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ముగ్గురి పరిస్థితి విషమం

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్లో ముగ్గురి పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రాత్రి సయ్యద్ ఆయేషా, హుసేని, జరీనా ఫాతిమాలను సంగారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటన నేపథ్యంలో బాధితులకు అవసరమైన వైద్య సేవలు అందించడంపై అధికారులు దృష్టి సారించారు.

హోటళ్లలో తనిఖీలు చేపట్టాలి

ఈ సందర్భంగా MP రఘునందన్ రావు మాట్లాడుతూ.. దసరా పండుగ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లలో భోజనం చేసే అవకాశం ఉన్నందున ఫుడ్ సేఫ్టీ అధికారులు, మున్సిపల్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పట్టణంలోని ప్రతి హోటల్, రెస్టారెంట్‌లో తనిఖీలు నిర్వహించి ఆహార నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించాలని తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడకుండా సంబంధిత అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

బాధితులకు అండగా ఉంటాం

చికిత్స పొందుతున్న బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని MP హామీ ఇచ్చారు. బాధితులు ధైర్యంగా ఉండాలని, ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా అవసరమైన వైద్య సేవలు అందించేందుకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నారాయణపూర్‌కు చెందిన ఈశ్వరును ఆప్యాయంగా పలకరించి అయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొని బాధితులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు.

© 2026 Bharath Samachar